సంక్షేమ మంత్రం.. అభివృద్ధి చక్రం

ఆలయాలు..
విద్యాలయాలకు శోభ చేకూరింది.
శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలకు కొత్త వెలుగొచ్చింది. ఇంటి చెంతనే వైద్యం అందుతోంది. వీధి ముంగిటే సచివాలయం కొలువుదీరింది. ఆ పక్కనే ఆర్బీకే దర్శనమిస్తోంది. సాగు నీటికి పరిష్కారం దొరికింది. తాగునీటి సమస్యే లేకుండా పోయింది. అందమైన రోడ్లు.. చూడచక్కని భవనాలు.. వెరసి మారుమూల మండలమైన చక్రాయపేటలో సంక్షేమ మంత్రంతో పాటు అభివృద్ధి చక్రం పరుగులు పెట్టింది.



చక్రాయపేట : పులివెందుల నియోజకవర్గంలోని మారుమూల చక్రాయపేట మండలంలో ఈ ఐదేళ్లలో అభివృద్ధి పరుగులు తీసింది. ఎన్నడూ లేనంతగా ఈ ప్రభుత్వ హయాంలో సంక్షేమంతో పాటు అభివృద్ధీ వెల్లి విరిసింది. గత ప్రభుత్వాల హయాంలో చక్రాయపేట చీకట్లో తండ్లాడగా.. ఈ ప్రభుత్వంలో వెలుగుల్లో నిండిపోయింది. ఈ ఐదేళ్లలో మండలంలో జరిగిన అభివృద్ధిని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అవగతమవుతుంది.

ప్రజల వైద్యం కోసం


చక్రాయపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రజలకు నాణ్యతతో కూడిన వైద్యం అందించాలని సర్వహంగులతో చక్రాయపేట, సురభిలలో ప్రభుత్వం ఆసుపత్రులకు నూతన భవనాలను నిర్మించారు. వీటికి ఒక్కొక్క దానికి రూ.2 కోట్ల చొప్పున ఖర్చు చేశారు. అలాగే ప్రతి గ్రామ సచివాలయానికి అనుసంధానంగా గ్రామీణుల వైద్యం కోసం 9 విలేజి క్లినిక్‌లను కట్టించారు. ఇందుకోసం ఒక్కో నిర్మాణానికి రూ. 18 లక్షల చొప్పున ఖర్చు చేశారు.

పంట సాగుకు కాలేటి వాగు..

చక్రాయపేట మండలంలోని అన్ని చెరువులకు నీటిని నింపి ప్రతి ఎకరాకు సాగు నీటిని అందించి రైతన్నల కళ్లల్లో ఆనందం చూడాలని కాలేటి వాగు ప్రాజెక్టు అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రు.2000 కోట్లు మంజూరు చేశారు. దీంతో కాలేటి వాగు ప్రాజక్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. త్వరలోనే పనులు పూర్తవు తాయని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. మండలంలోని అన్ని చెరువులను కృష్ణా జలాలతో నింపి సాగు, తాగు సమస్య లేకుండా చేయాలన్నదే ఈ ప్రాజెక్టు లక్ష్యం.

ప్రభుత్వ కార్యాలయాలకు మహర్దశ

శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ కార్యాలయాలకు ఈ ఐదేళ్లలో మహర్దశ పట్టింది. తహశీల్దారు, మండల ప్రజా పరిషత్ కార్యాలయాను సర్వ హంగులతో నూతనంగా నిర్మించారు. ఇందులో ఒక్కొక్క దానికి రూ.2కోట్లు చొప్పున ఖర్చు చేశారు. అలాగే ఒక్కొక్క నిర్మాణానికి రూ.40 లక్షల చొప్పున 11 గ్రామ సచివాలయాలను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం విశేషం.

పేద పిల్లల భవిత కోసం

విద్య కోసం ఈ ప్రభుత్వం నాడు-నేడు ద్వారా స్కూళ్ల అభివృద్ధి చేసింది. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి తీసి పోకుండా అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పించింది. విద్య కోసం ఎన్నోరకాల సంక్షేమ పథకాలు అమలు చేసి ఆర్థికంగా కూడా ఆదుకునే పథకాలు అమలు చేసి ఆదర్శంగా నిలిచింది. రూ. 3కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం విశేషం.

ఆలయాల అభివృద్ధి

ప్రముఖ గండి వీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు.దివంగత మహానేత గండిని టీటీడీలో విలీనం చేసి కొంత మేర అభివృద్ధి చేశారు. ఇక ప్రస్తుత ప్రభుత్వం ఆలయ పునర్నిర్మాణం కోసం ఏకంగా రూ.20 కోట్లు మంజూరు చేసింది.దీంతో ఆలయం సర్వాంగ సుందరంగా తయారవుతోంది.


నిర్మాణంలో గండి వీరాంజనేయ స్వామి ఆలయం

ఇంకా ఎన్నెన్నో

చక్రాయపేటలో మోడల్ పోలీసు స్టేషన్ రూ.95 లక్షలతో నిర్మించారు. మండల వ్యాప్తంగా ప్రజలకు తాగడానికి స్వచ్ఛమైన నీటిని అందించేందుకు 18 ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు చేశారు.ఇందుకోసం ఒక్కొక్క దానికి రూ. 10లక్షలు చొప్పున మంజూరు చేశారు. రూ.40 లక్షలతో చక్రాయపేట,నాగలగుట్టపల్లెల్లో వారపు సంతల షెడ్లు నిర్మించారు. రైతు శ్రేయస్సు కోరి చక్రాయపేటలో రూ.80 లక్షలతో అగ్రికల్చర్ మార్కెట్ గోడౌన్, రూ.1.20 లక్షలతో ఎస్సీ హాస్టల్ భవన నిర్మాణం పనులు పూర్తయ్యాయి. నెరుసుపల్లె నుంచి కె.ఎర్రగుడి వరకు కదిరి రోడ్డు విస్తరణకు రూ. 16 కోట్లతో పనులు పూర్తి చేశారు. రూ.80 లక్షలతో మారెళ్లమడక, బీటీ పల్లె సహకార పరపతి సంఘం కార్యాలయ భవనాలను నిర్మించారు. మారెళ్లమడక, చిలేకాంపల్లెల్లో డిజిటల్ లైబ్రరీలను నిర్మించారు. వీటికి ఒక్కొక్క డిజిటల్ లైబ్రరీని రూ.16 లక్షలతో నిర్మించారు.పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం 4 పాలకేంద్రాలు నిర్మించారు.వీటికి ఒక్కొక్క దానికి రూ.16 లక్షల చొప్పున ఖర్చు పెట్టారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ గ్రామాల మధ్యనున్న లింకు రోడ్లు, వీధుల్లో సిమెంటు రోడ్లతో మండలం వెలిగిపోతోంది.

వేగంగా బ్రిడ్జి నిర్మాణాలు

ఒకటి రెండు కాదు శతాబ్దాల కాలంగా చక్రాయపేట మండలంలో కుప్పం,రాజుపల్లెల మధ్య పాపాఘ్ని నదిలో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నోచుకోలేదు. వర్షాకాలంలో ఎక్కడి వారు అక్కడే అన్నట్లు మండల కేంద్రానికి సంబంధాలు ఉండేవి కావు.ఈ ప్రభుత్వంలో రూ.24 కోట్లుతో బ్రిడ్జి పనులు ప్రారంభించారు. ఇప్పటికి సుమారు 80శాతం పైగా పనులు పూర్తయ్యాయి. అలాగే అద్దాల మర్రి క్రాస్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రు.54 కోట్లు మంజూరు చేశారు. గండికొవ్వూరు వెన్నపల్లెల మధ్య హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పూర్తి అయ్యాయి.


చక్రాయపేట మండలం కె.రాజుపల్లె వద్ద పాపాఘ్ని నదిలో నిర్మిస్తున్న కాజ్‌వే


చక్రాయపేటలోని మోడల్ పోలీస్ స్టేషన్


నూతనంగా నిర్మించిన మండల ప్రజా పరిషత్ కార్యాలయం


మారెళ్లమడక సహకార పరపతి సంఘం భవనం


చిలేకాంపల్లె గ్రామ సచివాలయం


చక్రాయపేట తహశీల్దారు కార్యాలయం


చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆర్బీకేల ద్వారా



రైతులకు అన్నివిధాలా అందుబాటులో ఉండే విధంగా ప్రతి సచివాలయానికి అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఒక్కొక్క ఆర్బీకే నిర్మాణానికి రు.20 లక్షల చొప్పున ఖర్చు చేశారు. గత ప్రభుత్వ పాలనలో విత్తన కాయలు కావాలన్నా,ఎరువులు కావాలన్నా ఎన్నో వ్యవ ప్రయాసలకు లోనై ఇబ్బందులు పడేవారమని రైతన్నలు పేర్కొంటున్నారు. ఈ ప్రభుత్వంలో వీటన్నింటికి ఈ సమస్యలకు చెక్ పడిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మలేరియా నివారణకు చర్యలు తీసుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, తదితరులు

వేంపల్లె : మలేరియా రాకుండా ప్రతి ఒక్కరూ నివారణ చర్యలు చేపట్టాలని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిజాముద్దీన్ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి నీటితొట్లను, ఇతర పాత్రలు శుభ్రం చేసుకుని నీటిని నింపుకోవాలన్నారు. రాత్రిపూట తప్పనిసరిగా దోమతెరలు వాడాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నిసాబేగం, సీహెచ్‌ఓ వెంకటరత్నం, ఎంపీహెచ్‌ఇఓ ఫక్రుద్దీన్, సీహెచ్‌ఓ బస్సయ్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సుభాషిణి

లింగాల : మండలంలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించామని లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సుభాషిణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా ప్లాస్మోడియం అనే పరాన్నజీవి ద్వారా వస్తుందన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చినట్లయితే రక్తపరీక్షలో నిర్ధారించిన ప్లాస్మోడియం రకాన్ని బట్టి వైద్యాధికారి తగు చికిత్స అందిస్తారన్నారు. సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ ఎవరికైనా మలేరియా సోకితే ఆ గ్రామంలో ప్రతి ఒక్కరికి రక్తపరీక్షలు నిర్వహించి దోమల నివారణ కోసం డీడీటీ పిచికారి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివరాం, పీహెచ్ కుసుమకుమారి, సూపర్‌వైజర్, హాషియా బేగం, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రచారం


బసిరెడ్డిపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్నదే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అంకిరెడ్డిపల్లె, బసిరెడ్డిపల్లె, వెల్దుర్తి గ్రామాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఐదేళ్ల కాలంలో సీఎం జగన్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలపాల్సిన అవసరముందన్నారు.

సిగటోక నివారణ చర్యలపై అవగాహన


అరటి పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త సునీల్‌కుమార్, తదితరులు

పులివెందుల రూరల్ : అరటిలో సిగటోక నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త సునీల్‌కుమార్ వివిధ తెగులుపైన సిగటోక నివారణ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. కాయలు పక్వానికి రాకముందు గెలలు పడిపోవుట, నివారణ చర్యలు గురించి వివరించారు. శాస్త్రవేత్త నాగేంద్ర మాట్లాడుతూ అరటిలో వచ్చే పురుగులు వాటి నివారణ చర్యలు గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. అరటిలో విలువ ఆధారిత పదార్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉద్యానవనశాఖ అధికారి రాఘువేంద్రా రెడ్డి, శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

కమలాపురం : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన నామినేషన్ల ఘట్టం ముగిసింది. చివరిరోజు గురువారం అత్యధికంగా 26 మంది నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థిగా పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి రెండో సెట్టు దాఖలు చేయగా, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తనయుడు నరేన్ రామాంజులరెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అలాగే వివిధ పార్టీలకు చెందిన, స్వతంత్ర అభ్యర్థులు 26 మంది తమ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ గణేష్ కుమార్‌కు అందజేశారు. కాగా మొత్తం 35 మంది నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం స్క్రూటినీ ఉంది. అలాగే ఈ నెల 29 వరకు ఉపసంహరణకు గడువు ఉంది.

పులివెందుల జనసంద్రం

అభిమానజల్లుల్లో పులివెందుల తడిసి ముద్దయింది. మండే ఎండ కూడా చిన్నబోయింది. తన బిడ్డ ఉన్నతిని చూసి సొంత గడ్డ మురిసిపోయింది. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాకతో పులివెందుల జనసంద్రమైంది. తమ అభిమాన నాయకుడి నామినేషన్ కార్యక్రమాన్ని ఆ పార్టీ నేతలు పండుగలా మార్చారు. వెరసి నియోజకవర్గ వ్యాప్తంగా ఎటు చూసినా సందడి వాతావరణం కనిపించింది.


సింహాద్రిపురం : బహిరంగ సభకు తరలివెళ్తున్న గండ్లూరి వీరశివారెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : పులివెందుల సీయస్‌ఐ చర్చి మైదానంలో జరిగిన సీఎం జగన్ భారీ బహిరంగ సభకు పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు, నాయకులు, వైఎస్సార్సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలో మున్సిపల్ ఇన్చార్జ్ వైఎస్ మనోహర్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అలాగే పట్టణంలోని అన్ని కులసంఘాలు, మహిళలు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థలు అందరు జై జగన్ జైజై జగన్ నినాదాలతో భారీ ర్యాలీగా ప్రధాన రహదారుల్లో నిండుకుండలా సభకు తరలివెళ్లారు.


పులివెందుల టౌన్: బహిరంగ సభకు తరలివెళ్తున్న బలిజసంఘం నాయకులు

నామినేషన్‌కు తరలివచ్చిన వైఎస్సార్సీపీ శ్రేణులు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని 21వ వార్డు కౌన్సిలర్ కోడిరమణ ఆధ్వర్యంలో మహిళలు, వైఎస్సార్సీపీ శ్రేణులు, పార్టీ కార్యకర్తలు బహిరంగ సభకు తరలివెళ్లారు. మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లెలోని బలరామిరెడ్డి, అజ్జుగుట్టు భాస్కర్ రెడ్డి, కొత్తపల్లె గ్రామంలోని పుష్పనాథరెడ్డి, ఓబుల్ రెడ్డి, తుమ్మలపల్లె ఎంపీటీసీ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డిలు, ఎర్రిపల్లి మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మెన్‌సర్వోత్తమరెడ్డిల ఆధ్వర్యంలో నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలివచ్చారు.

జగన్ నామినేషన్‌కు తరలివెళ్లిన వైఎస్సార్సీపీ నాయకులు

వేముల : వైఎస్సార్సీపీ మండల ఇన్‌చార్జ్ నాగెళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ వెంకటబయపురెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి 150 వాహనాల్లో సీఎం నామినేషన్ కార్యక్రమానికి మేము సిద్ధమంటూ తరలివెళ్లారు. అలాగే మండలంలోని వేల్పుల గ్రామం నుంచి మండల పరిశీలకులు రామలింగారెడ్డి ఆధ్వర్యంలో యువకులు బైకు ర్యాలీగా జై జగన్ అంటూ సీఎం బహిరంగ సభకు తరలివెళ్లారు.

జగనన్నను ఆశీర్వదించేందుకు తరలిన అభిమానులు

చక్రాయపేట: చక్రాయపేట మండలం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు బహిరంగ సభకు వెళ్లారు. మండల ఇన్‌చార్జ్ వైఎస్ కొండారెడ్డి ఆధ్వర్యంలో జనం బస్సులు, కార్లలో స్వచ్ఛందంగా తరలి వెళ్లి ఆయనకు సంఘీభావం తెలిపారు.

మేము సిద్ధం

లింగాల : మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. బైకు ర్యాలీలు, బస్సులు, వ్యాన్‌లు, బులెరోలలో సిద్ధం జెండాలను పట్టుకుని మేము సిద్ధం అంటూ నినాదాలు చేస్తూ తరలివచ్చారు. మండల కన్వీనర్ పీపీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్సీపీ నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చారు.


పులివెందుల టౌన్ : బహిరంగ సభకు భారీగా తరలివస్తున్న ప్రజలు, నాయకులు, కార్యకర్తలు

సీఎం సభకు తరలివెళ్లిన నాయకులు

తొండూరు : తొండూరు మండల ఇన్‌ఛార్జ్ వైఎస్ మధురెడ్డి, మండల అధ్యక్షులు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచే మండలంలోని ప్రతి గ్రామం నుంచి దాదాపు 300 వాహనాల్లో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు సురేష్‌రెడ్డి, శివశంకర్ రెడ్డి, మండల పరిశీలకులు రామమునిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శశికాంత్‌రెడ్డి, తాలూకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, జేఏసీ కన్వీనర్ రజనీకాంత్‌రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, గంగిరెడ్డి, బాల గంగిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, హర్షణీకుమార్, రమణారెడ్డి, బాలనరసింహారెడ్డి, గురుమోహన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, బంగారు మునెయ్య, శివశంకర్, ప్రకాష్ రావు, భాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, రామసుబ్బారెడ్డి, లారీల సుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలివచ్చిన వైఎస్సార్సీపీ శ్రేణులు

సింహాద్రిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి వైఎస్సార్సీపీ ఎన్నికల పరిశీలకుడు గండ్లూరి వీరశివారెడ్డి, మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. 'మళ్లీ సీఎంగా గెలిపించుకోవడానికి మేము సిద్ధం' అంటూ బహిరంగ సభకు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.

సీఎం సభకు భారీగా తరలివెళ్లిన వైఎస్సార్సీపీ నాయకులు

వేంపల్లె : బహిరంగ సభకు వేంపల్లె మండలం నుంచి భారీగా వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. దాదాపు 150 వాహనాల్లో సీఎం సభకు హాజరయ్యారు. దారి పొడుగునా జై జగన్ అంటూ నినాదాలు చేశారు. శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మెన్ సతీష్‌కుమార్‌రెడ్డి, వేంపల్లె జడ్పీటీసీ సభ్యులు రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిగాయత్రిలు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


వేంపల్లె : బహిరంగ సభకు వెళ్తున్న వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు


లింగాల నుంచి బైక్ ర్యాలీతో పులివెందులకు తరలివస్తున్న వైఎస్సార్సీపీ శ్రేణులు


పులివెందుల టౌన్ : జై జగన్ నినాదాలతో తరలివస్తున్న నాయకులు


పులివెందుల రూరల్: నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్తున్న వైఎస్సార్సీపీ శ్రేణులు